విజయం దిశగా అడుగులు వేస్తున్నాం : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - కడప

పశ్చిమ రాయలసీమ ఎంఎల్‌సి వైసిపి అభ్యర్థుల విజయం కోసం సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నామని భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని అపూర్వ కళ్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ అభ్యర్థులు శాసనసభ్యులతో కలిసి మమేకమై విజయం దిశగా అడుగులు వేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ ఉద్యోగులకు, పట్టభద్రులకు అనేక మంచి పనులు చేశారని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలు రాలేదని, ప్రతిపక్షాలు విష ప్రచారాలు చేస్తున్నాయని, గత ఏడాది దేశంలోనే ఏపికి అత్యధిక పెట్టుబడులొచ్చాయని చెప్పారు. వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థుల విజయం కోసం అందరం కలిసి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు కె. సురేష్ బాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కసరత్తు

రూ.17.28 కోట్లతో ప్రతిపాదనలు - 0.65 ఎంఎల్‌డి సరఫరాకు యాక్షన్‌ప్లాన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

తాగునీటి ఎద్దడి నివారణ కసరత్తు ఊపందుకుంది. జిల్లా గ్రామీణ నీటి సరఫరా పథకం (ఆర్‌డబ్ల్యుఎస్) విభాగం రూ.17.28 కోట్ల వ్యయంతో కూడిన ప్రతిపాదనలను అందజేసింది. ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తిన వెంటనే యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశారు. మార్చి నుంచి జూన్ వరకు తాగునీటి సరఫరా చేయడంపై దృష్టి సారించారు. ప్రధానంగా ట్రాన్స్ పోర్టేషన్, హైరింగ్, డీపెనింగ్, ఫ్లష్సింగ్, పైప్‌లైన్ మరమ్మతులు కోసం నిధులను ఖర్చు చేయనున్నారు. గతేడాది వర్షాలు పుష్కలంగా కురిసినప్పటికీ నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో ముందు జాగ్రత్త ఏర్పాట్లలో భాగంగా తాగునీటి సరఫరా ఇంజినీరింగ్ యంత్రాంగం ముందస్తు ప్రణాళిక ఏర్పాట్లు చేసింది. మార్చిలో వ్యయం చేసిన పద్దుల ఆధారంగా తరువాతి నెల వ్యయం ఆధారంగా నిధులను విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

25 మండలాల్లో రవాణా

జిల్లాలోని 25 మండలాల్లోని 1191 హ్యాబిటేషన్లు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనే అవకాశం ఉన్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ అంచనా వేసింది. 13.40 లక్షల మంది జనాభాకు 65 మిలియన్ లీటర్ ఫర్ డే చొప్పున తాగునీటి సరఫరా చేయడానికి ప్రణాళికను సిద్ధం చేసింది. మార్చిలో 64, ఏప్రిల్‌లో 157, మేలో 166, జూన్‌లో 130 హ్యాబిటేషన్లు తీవ్ర ప్రభావిత హ్యాబిటేషన్లుగా గుర్తించినట్లు తెలుస్తోంది. సాధారణ హ్యాబిటేషన్లు మార్చిలో 35, ఏప్రిల్‌లో 117, మేలో 126, జూన్‌లో 90 హ్యాబిటేషన్లలో తాగునీటి సరఫరా చేయనుంది.

డేంజర్‌జోన్‌లో బద్వేల్

బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని బద్వేల్, కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, గోపవరం, అట్లూరు మండలాలు తీవ్ర ప్రభావిత ప్రాంతాలుగా ఉండడం తీవ్రతకు అద్దం పడుతోంది. జిల్లాలోని 25 మండలాల పరిధిలోని 10,072 ట్రిప్పు చొప్పున సరఫరా చేయ నుంది. పశువుల ట్రాన్స్‌పోర్టేషన్‌కు 61.5 లక్షలు, హైరింగ్ వనరు లకు రూ.0.17 లక్షలు, బోర్‌వెల్స్ ఫ్లషింగ్ నిమిత్తం రూ.12. 22 లక్షలు, బోర్‌వెల్స్ డీపెనింగ్ నిమిత్తం రూ.67.6 లక్షలు ఖర్చు చేయ నుండడం గమనార్హం.

తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి

తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి సారించాం. జిల్లాలోని 6,715 చేతిపంపులు, 2,772 పిడబ్ల్యుఎస్, ఎంపిడబ్ల్యు ఎస్, డిపిస్కీములు, 15 సిపిడబ్ల్యు స్కీముల్లో 14 స్కీములను మరమ్మతులు చేయడమైంది. తాగునీటి సరఫరా చేయడానికి యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడమైంది.

- వీరన్న, ఎస్ఇ, ఆర్‌డబ్ల్యుఎస్, కడప.

ఆర్‌టిసి బస్టాండ్ల ప్రయివేటీకరణ ఆపాలి

కడప బస్టాండ్ వద్ద నిరసనలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎపిఎస్‌ఆర్‌టిసి బస్టాండ్ల ప్రయివేటీకరణ ఆపాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడప జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి బస్టాండ్ ఎదుట సిఐటియు నాయకత్వంతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలాల లీజు పేరుతో జరుగుతున్నది కేంద్ర ప్రభుత్వ నగదీకరణ పథకమేనని పేర్కొన్నారు. ఆర్‌టిసికి చెందిన 100 బస్సు స్టేషన్లను 33 సంవత్సరాల లీజు పేరుతో ప్రయివేట్ సంస్థలకు, కార్పొరేట్ వ్యక్తులకు ఇవ్వాలని తీవ్ర సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ రవాణా మంత్రిత్వ శాఖ ప్రయివేటీకరణ నిర్ణయాలను ఆర్‌టిసిలో అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగమే ఏటా వెయ్యి అద్దె బస్సులు, ఆర్టిఐసి బస్సుల స్థానంలో ప్రయివేటు విద్యుత్తు బస్సుల ప్రవేశం, స్క్రాపింగ్ పాలసీ, యుటిఎస్ మిషన్లు వంటివి యాజమాన్యం వేగంగా అమలుకు పూనుకుంటున్నదని పేర్కొన్నారు.

రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రానున్న రోజుల్లో పిపిపి పేరుతో మొత్తం సంస్థను ప్రైవేటీకరణ చేయటానికి మాత్రమే ఈ ప్రయత్నాలు, సన్నాహాలు ముమ్మరం చేశారని తెలిపారు. వడోదర మోడల్ పేరుతో గుజరాత్‌లోని ఎంతో విశాలమైన వడోదర బస్ స్టేషన్‌ను ప్రయివేట్ కన్సార్టియమ్లకి అప్పజెప్పి ఆ బస్ స్టేషన్‌ను అన్ని ప్రయివేట్ బస్సులు వచ్చే ఏర్పాటు చేశారని చెప్పారు. అక్కడ ఆర్‌టిసి బస్సులకు కూడా కొన్ని ప్లాట్‌ఫారం మాత్రం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే ఇంటిగ్రేటెడ్ బస్ స్టేషన్ల పేరుతో వీటిపై అధ్యయనం చేశారని తెలిపారు.

బస్టాండ్ ఎదుట నిరసన తెలియజేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

సిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనువాసులురెడ్డి మాట్లాడుతూ గుజరాత్‌కు ఒక అధికారుల బృందాన్ని కూడా పంపి వడోదరా మోడల్‌ను అధ్యయనం చేశారు. వడోదర మోడల్ అంటే అది ఒక విఫల ప్రయోగమని పేర్కొన్నారు. ప్రయివేటీకరణని వీరు అభివృద్ధి అని పిలుస్తున్నారని చెప్పారు. పబ్లిక్, ప్రయివేట్ పార్టిసిపేషన్ పేరుతో జరుగుతుందని తెలిపారు. దేశంలోని 26 ఆర్టీసీలను, రాష్ట్ర ప్రభుత్వ డిపార్ట్మెంట్లుగా నడుపుతున్నాయని చెప్పారు. ఎవరికీలేని తొందర ఆర్‌టిసి యాజమాన్యంకు వచ్చిందని పేర్కొన్నారు. ఆర్టీసీ ఆస్తులను విలీనం పేరుతో కార్పొరేట్లకు అర్పణం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దివాకర్, కడప జోనల్ కార్యదర్శి భాస్కర్, నాయకులు పి.వి.నాదం, వైఎస్.రాజు పాల్గొన్నారు.

తపన ఉంటేనే మంచి రచన సాధ్యం

- పుస్తకావిష్కరణ సభలో కేతు విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

సమాజం పట్ల తపన ఉన్నప్పుడే రచయిత నుంచి మంచి కథలు ఆశించగలమని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అన్నారు. శనివారం స్థానిక సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మ లూరు సురేష్ బాబు, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ కథకులు షేక్. హుసేన్ సత్యాగ్ని రచించిన 'కథా స్రవంతి' ప్రత్యేక సంచిక, సత్యాగ్ని కథలు పుస్తక పరిచయ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కేతు మాట్లాడుతూ సత్యాగ్ని నిరంతర అధ్యయన శీలి అని, ముస్లిం సమాజంలోని అంతరాలను వెలికితీస్తూ చేసిన ఆయన రచనలు మేధోవర్గాన్ని కదిలించగలిగాయన్నారు. నేటికీ రాయాలన్న తపనగల షేక్ హుసేన్‌ను కేవలం ముస్లిం మైనార్టీ కథల రచయితగా పరిమితం చేయవద్దన్నారు. ఈ కథా సంకలనం గురించి కళాశాల విద్యార్థులకు పరిచయ సభలు ఏర్పాటు చేయాలని, సత్యాగ్ని రచనలను హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువదించాలని సూచించారు. అరసం జిల్లా అధ్యక్షులు ఆచార్య నల్లపురెడ్డి ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ముస్లిం జీవితాల్లోని కడగండ్లను తొలిసారిగా కథల రూపంలో తెచ్చిన ఘనత షేక్ హుసేన్ సత్యాగ్నిదేనన్నారు. ఆయన కథల గొప్పతనం గుర్తించి అరసం రాష్ట్ర సభల సందర్భంగా సంకలనం తెచ్చామని తెలిపారు. ముస్లిం జీవితాల గురించి రాసే బాధ్యత భావి రచయితలపై ఉందన్నారు. గౌరవ అతిథి లయన్ మానస చిన్నపరెడ్డి మాట్లాడుతూ తాను చూసిన జీవితాలనే కథలుగా మలిచారని, కనుక సత్యాగ్ని రచనలు అంత ప్రభావితం చేయగలుగుతున్నాయని తెలిఆపరు. ఈ సరళిని యువ రచయితలు వేంపల్లె షరీఫ్, షబ్బీర్ హుసేన్లు అందిపుచ్చుకోవాలని సూచించారు. కథల సంపుటి సంపాదకులు పాలగిరి విశ్వప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నాటి ముస్లిముల సంప్రదాయాల వెనుక సమస్యల గురించి రాయడానికి సత్యాగ్ని సాహసమే చేశారన్నారు. మత సామరస్యంపై వారు వెలువరిస్తున్న కథలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం కాగలవన్నారు. వేంపల్లె షరీఫ్ మాట్లాడుతూ స్థానికంగా ముస్లిముల సమస్యలు దేశ వ్యాప్తంగా ఇస్లామిక్ దేశాల వెనుక వ్యాపార కోణాన్ని గమనించాల్సిన అవసరం ఉందన్నారు. సమీక్ష - ఈ సందర్భంగా సత్యాగ్ని కథల పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కొండూరు జనార్దన రాజు పర్యవేక్షణలో షేక్ హుసేన్, పాతిమా దంపతులను అతిథులు, నిర్వాహకులు, అభిమానులు ఘనంగా సత్కరించారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేతు విశ్వనాథరెడ్డి

శనగల కొనుగోలులో అక్రమాలు నివారించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న దస్తగిరి రెడ్డి

రబీ సీజన్‌లో పండిన శనగలు, మినుములను మార్క్ ఫెడ్ డిసిఎంఎస్ ద్వారా 21 కేంద్రాలలో కొనుగోలు చేస్తున్నారని, అందులో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, వెంటనే నివారించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. శనివారం రైతు సం ఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మా ట్లాడారు. లేబర్ చార్జీ రూ.60 కాకుండా, అదనంగా క్వింటాకు రూ.100 వసూలు చేస్తున్నారని తెలిపారు. ఆర్‌బికెలలో రైతుల పేర్లు నమోదు చేయి ంచుకోవాలని అక్కడే కొనుగోలు చేస్తామని చెప్పిన అధికారులు ఆచరణలో సాధ్యం కాలేదన్నారు. మార్కెట్ యార్డులలో కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. అక్కడ దళారులు అదనంగా క్వింటాకు రూ.100 తీసుకుంటున్నారని, తద్వారా రైతులు నష్టపోతున్నారని చెప్పారు. నాసిరకం శనగలని, తేమ శాతం, నల్ల గింజలని, తరుగు పేరుతో క్వింటాకు రూ.100 దళారులు వసూలు చేస్తున్నారని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వసూలు చేస్తున్నామని చెప్తున్నారని పేర్కొన్నారు. ఒక్కో రైతు నుంచి గరిష్టంగా 20 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడం సరైనది కాదని చెప్పారు. ఈ రబీ సీజన్లో సకాలంలో వర్షాలు పడడంతో శనగ పంట ఎకరాకు 7 -8 క్వింటాల పండిందని, రైతులు పండిన పంటనంతా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం జిల్లా ఉన్నతాధికారులను కలుస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట

ప్రజాశక్తి-చెన్నూరు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సురేష్‌యాదవ్

బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందని ఎంపిపి చీర్లసురేష్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపిపి కార్యాలయంలో బిసి నాయకులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటకు కట్టుబడి బిసిలకు సముచిత స్థానం కల్పించారని చెప్పారు. ఇందుకు ప్రస్తుతం ఎంఎల్‌సి ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన్యతే ఉదాహరణ అన్నారు. దీనిపై ప్రతి పక్షాలు వ్యంగ్యాస్త్రాలు సంధించడం దారుణమని వాపోయారు. చట్టసభలలో ఎన్నడూ అడుగుపెట్టని కొన్ని కులాలకు చెందిన వారిని శాసన మండలి స్థానాలకు అభ్యర్థులుగా ఎంపిక చేయడం గొప్ప విషయమన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎవరైనా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలను ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేశారని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర తొగట వీర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మడక విజయలక్ష్మి, సర్పంచ్ టిసిడి చంద్ర, వైసిపి నాయకులు జగన్నాథం, మడక వెంకటసుబ్బయ్య, మాజీ సర్పంచ్ శేఖర్, మాజీ ఎంపిటిసి నరసయ్య యాదవ్, డాక్టర్ పిచ్చయ్య పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

కలసపాడు : మండలంలోని భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తహశీల్దార్ జి. రవిశంకర్ పేర్కొన్నారు. శనివారం ఆయన దూలంవారిపల్లె నుంచి వచ్చిన బాధితులతో మాట్లాడారు. సర్వే నంబర్ 117, 129లో ఉన్న భూములను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. మండలంలో ఇంతవరకు మూడు పంచాయతీలైన తంబళ్లపల్లె, పుల్లారెడ్డిపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో రీసర్వేలు పూర్తి చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లోని ఆన్‌లైన్ భూ సమస్యలను పరిష్కరించడానికి విఆర్‌ఎ, విఆర్‌ఒల ద్వారా సమాచారాన్ని సేకరించి తదుపరి చర్యలకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. గ్రీవెన్స్‌కు వెళ్లకుండా తహశీల్దార్ కార్యాలయంలోనే బాధితుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

కాంగ్రెస్ మహాసభల్లో జిల్లా నేతలు

కడప : చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ మహా సభలకు జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జ తిరుమలేష్ వెళ్లారు. జాతీయ కాంగ్రెస్ నాయకత్వాన్ని బలోపేతం చేయడంలో తమ వంతు కృషి చేస్తామన్నారు. జాతీయ సమావేశానికి ఆహ్వానం రావడం సంతోషకరంగా ఉందన్నారు. భవిష్యత్తులో రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి కృషి చేస్తామన్నారు.

జిల్లా కాంగ్రెస్ నాయకులు నీలి శ్రీనివాసరావు బొజ్జ తిరుమలేష్

చార్టర్డ్ అకౌంటెంట్స్ జిల్లా నూతన అధ్యక్షులుగా ఖాజా హుస్సేన్

కడప అర్బన్ : నగరంలోని ఎన్జీవో కాలనీలో ఉన్న జిల్లా సిఎ బ్రాంచ్ కార్యాలయంలో ఎస్ఐఆర్‌సి ఆఫ్ ఐసిఎఐ జిల్లా అధ్యక్షులుగా ఆడిటర్ సి.ఎ.కె ఖాజా హుస్సేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సి.ఎ. చంద్రశేఖర్, కార్యదర్శిగా సి.ఎ. సుజన్‌కుమార్‌రెడ్డి, ట్రెజరర్‌గా సి.ఎ. జనార్దన్ రెడ్డి, సికాస చైర్మన్‌గా సీ.ఏ సుశాంత్ రెడ్డి ఎన్నికైనారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షులు ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి పాటు పడతానని పేర్కొన్నారు.

యథాస్థానంలోనే పోస్టింగ్ ఇవ్వాలని ఎఎన్ఎంల ఆందోళన

ప్రజాశక్తి-కడప సిటీ

రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న ఎఎన్ఎంలు

ప్రభుత్వం ఇస్తున్న రూ.15వేలు, రూ.25 వేల వేతనంతో సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తే ఎలా అని, ఇది చాలా అన్యాయమని, కుటుంబాలను వదులుకుని సురూదర ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి అని ఎఎన్ఎంలు పేర్కొన్నారు. బదిలీలలో తమకు అన్యాయం జరిగిందని చిత్తూరు జిల్లాకు చెందిన కొందరు ఎఎన్ఎంలు శనివారం ఐఎంఎ హాలు ఎదుట కడప-చెన్నై రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఎన్ఎం ట్రైనింగ్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలన్నారు. యథాస్థానంలోనే ట్రైనింగ్ కొనసాగించి తరువాత కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇష్టా రాజ్యంగా సమయపాలన లేకుండా కౌన్సెలింగ్ నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. రెగ్యులర్ ఎఎన్ఎంలకు ప్రమోషన్లలో ప్రాధాన్యత ఇస్తే ఎలాంటి అభ్యంతరం లేదని, నిబంధనలు పక్కన పెట్టి చెప్పిన చోట పనిచే యాల్సిందేనని హుకుం జారీ చేయడం సరికాదని తెలిపారు. ఎఎన్ఎంల ఆందోళనతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడ్డంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆర్‌డి కోటేశ్వరితో మాట్లాడి పరిస్థితిని సద్దుమణించారు. తాము నిబంధనల మేరకే కౌన్సెలింగ్ నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని, అందరికీ సమ న్యాయం చేస్తామని ఆర్‌డి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ముగిసిన జాతీయ సదస్సు

కడప : ప్రభుత్వ పురు షుల కళాశాలలో, ఐసి ఎస్ఎస్ఆర్ సహకారంతో రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో 'పొ ల్యూషన్ కంట్రోల్ అండ్ సస్టేయినబుల్ ఎన్వి రాన్మెంట్' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం విజయవంతంగా ముగిసింది. సదస్సుకు అధ్యక్షులుగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపల్ జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ, రెడ్యూస్, రియూస్, రిసైకిల్ ప్రాధాన్యతను వివరించారు. ఈ సదస్సుకు వెంకటేశ్వర విశ్వవిద్యాలయ రసాయన శాస్త్రం ఆచార్యులు వై.వి రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రస్తుత కాలంలో ఇటువంటి సదస్సుల నిర్వహణ అత్యంత ఆవశ్యకమని చెప్పారు. ఐఐటి, మద్రాస్, రసాయన శాస్త్రం విభాగం ఆచార్యులు రమేష్ ఎల్ గార్దాస్ ముఖ్య వక్తగా హాజరై నిత్య జీవితంలో, నిత్యావసర వస్తువుల్లో పర్యావరణ రహిత వస్తువుల వినియోగాన్ని పెంచాలని చెప్పారు. సదస్సు సంచాలకులు డా. సి. నాగేశ్వరా రెడ్డి పర్యావరణ పరిరక్షణలో వివిధ దేశాలు అనుసరిస్తున్న విధానాలను వివరంగా పేర్కొన్నారు. సదస్సులో మానస ఇన్ హోటల్ అధినేత లయన్ చిన్నపరెడ్డి, రసాయన శాస్త్ర విభాగాధిపతి జె. వెంకట లక్ష్మి, అధ్యాపకులు, వివిధ కళాశాలల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పరిశోధన వ్యాస సంకల్పన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.

మాజీ మంత్రి వ్యాఖ్యలు బాధాకరం

కడప అర్బన్ : మాజీ మంత్రి, వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థి రామ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని టిడిపి ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం గాయత్రీ టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో దిగజారింది వైసిపినే అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి దిగజారి రాజకీయం చేసిందని విమర్శించడం దారుణమన్నారు. జమ్మలమడుగులో టిడిపి అంటే శివా రెడ్డి కుటుంబం, శివా రెడ్డి అంటే టిడిపి అన్నారు. తెలుగుదేశం పార్టీ పొన్నపురెడ్డి కుటుంబానికి ఎంతో చేసిందని తెలిపారు. చంద్రబాబు హాయంలో మంత్రిగా పనిచేశారని పేర్కొన్నారు. జమ్మల మడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మిమ్మల్ని ఏ విధంగా పిలుస్తారో జిల్లా ప్రజలం దరికీ తెలుసన్నారు. ఎమ్మెల్సీ పదవి కోసం దిగజారింది మీరు కాదా అని ప్రశ్నించారు. జిల్లాలో సీనియర్లు పార్టీ వదిలివెళ్లినా, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి, పుత్తా నరసింహారెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్ , మరి కొందరు నాయకులు తెలుగుదేశం పార్టీ కోసం పని చేస్తున్నారని పేర్కొన్నారు. బిల్లుల రాకపోయినా, గన్ మెన్లను తొలగించినా శ్రీనివాసరెడ్డి పార్టీ వైపే నిలిచారని చెప్పారు. మరో అభ్యర్థి పోటీలో ఉంటే ఓడిపోతామన్న భయంతో దొంగ సంతకాల పేరుతో ఇండింపెండెంట్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరించేలా చేశారని ఆరోపించారు.

సిబిఐ దర్యాప్తును స్వాగతిస్తున్నాం

ప్రజాశక్తి- కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న బాలదాసు

వివేకానందరెడ్డి హత్యకు చంద్రబాబు నాయుడు కారకులని జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గమైన నింద వేశారని, దోషులను సిబిఐ దర్యాప్తు సంస్థ పూర్తి స్థాయిలో ఆధారాలు సేకరించి బహిర్గతం చేయడం స్వాగతిస్తున్నామని తెలు గుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు తెలిపారు. నగరంలోని తెలుగు యువత టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమాన్ కార్యాలయంలో మైనారిటీసెల్ నగర అధ్యక్షుడు ఇమ్రాన్ కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబిఐని చంద్రబాబు నాయుడు ప్రభావితం చేశారని సజ్జల విమర్శించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు నాయుడుపై మాజీ మంత్రి కొడాలి నాని వ్యాఖ్యలు సరైందని కాదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రజల ప్రత్యేకంగా గుర్తింపు సంపాదించిన నాయకుడన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగు పర్చుకోవాలి

వల్లూరు : విద్యార్థులు విద్యతోపాటు జీవన ప్రమాణాలు జీవన ప్రమాణ నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో నిర్వహిస్తున్న రూమ్ టు రీడ్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. విద్యార్థులు జీవన ప్రమాణాల పెంచుకొని ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో రూమ్ టు రిడ్ కో-ఆర్డినేటర్ సదాశివారెడ్డి, ప్రిన్సిపల్ నసిమున్నీసా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ అరుణ్‌రెడ్డి

సంఘ వ్యతిరేక శక్తులపై ఉక్కుపాదం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

సంఘ వ్యతిరేక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్ఐ అరుణ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కృష్ణాపురంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు కృష్ణాపురంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. తనిఖీల్లో భాగంగా సరైన రికార్డులు లేని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కొత్త వ్యక్తులెవరైనా అనుమానాస్పందగా కన్పిస్తే తమకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. స్థానికంగా బెల్టు, నాటుసారా, గంజాయి వంటివి ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు : ఎస్ఇ

ప్రజాశక్తి-కడప

ఆదివారం సెలవు దినం అయినప్పటికీ జిల్లా పరిధిలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉన్న విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యధావిధిగా పనిచేస్తాయని విద్యుత్ ఎస్ఇ ముని శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సదవకాశాన్ని వినియోగించుకొని బిల్లులను సకాలంలో చెల్లించి విద్యుత్ సంస్థకు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు.

'భూమితో ఎలాంటి సంబంధం లేదు'

ప్రజాశక్తి - కడప అర్బన్

చాపాడు గ్రామ పొలంలోని సర్వే నంబరు 105 -ఎ లో 2.82 ఎకరాల భూమికి సంబంధించి తమకు ఎలాంటి సంబంధం లేకపోయినా అక్రమ కేసులు పెట్టి కోర్టుకు లాగుతున్నారని నాగులపల్లికి చెందిన నీలకంఠ రెడ్డి, భాస్కర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ తమపై జమ్మలమడుగుకు చెందిన శాంతారాం, శశికళలు తప్పు డు కేసులు పెట్టి వేధిస్తున్నారని వాపో యారు. వారు చెబుతున్న భూమి చాపాడు గ్రామ పొలంలోని సర్వేనెంబర్ 105-ఏ లో 2.82 ఎకరాల భూమికి సంబంధించి తమకు కానీ, తమ కుటుంబ సభ్యులకు కానీ ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అలాగే కొత్త పల్లె సర్పంచి బండి నాగేంద్ర, వనిపెంటకు చెందిన కలిమి పుల్లారెడ్డి, బాపతి సంజీవ్ రెడ్డి, శ్రీను వారి భూతగాలతో గొడవపడుతూ మధ్యలో తమల్ని లాగడం బాధాకరమన్నారు. ఆ భూమి వ్యవహారం మూడు సంవత్సరాలుగా పెండింగ్ ఉందన్నారు. ఇందులోకి తమల్ని లాగొద్దని అన్నారు.

గృహాలు మార్చిలోగా పూర్తి చేయాలి

కలసపాడు : జగనన్న పక్కా గృహాలు మార్చిలోగా పూర్తి చేయా లని ఎంపిడిఒ షేక్ మహ బూబ్‌బీ పేర్కొ న్నారు. శనివారం ఆమె విలే కర్లతో మాట్లాడుతూ మండలంలో 45 శాతం జగనన్న పకాగృహాలు పూర్త య్యాయని, మిగిలినవి మార్చిలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జగనన్న ఇచ్చిన లేఅవుట్ లో చాలామంది నిర్మించడం లేద, స్వతహాగా వారికున్న సొంత స్థలంలో ఇల్లు నిర్మించు కుంటున్నారని చెప్పారు. రామాపురం గ్రామ పంచాయతీలోని గంగయ్య పల్లి దగ్గర జగనన్న లేఔట్‌లో కాంట్రాక్టర్, ఎంపిపి నారాయణతో మాట్లాడి గృహాలు లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసేకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. పనుల పరిశీలనకు ఎప్పటికప్పుడూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి గంధం, మురారి, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

కోలాహలం

ప్రజాదృష్టి

జిల్లాలో ఎన్నికల కోలాహలం మొదలైపోయింది. సరిగ్గా ఏడాది వ్యవధిలోనే 2024 సార్వత్రిక ఎన్నికలు రానుండడం అధికార, ప్రతిపక్షాలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఇంతలో ఎమ్మెల్సీ ఎన్నికలు రావడం సార్వత్రికానికి రిహార్సల్‌గా మారినట్లు పరిశీలకులు పేర్కొంటుండడం గమనార్హం. ఉమ్మడి కడప జిల్లాలో అధికార పార్టీ హవా ధాటికి ప్రతిపక్ష పార్టీలు కోలుకోలేని వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సొంత జిల్లాలో అధికార వైసిపికి ఎదురు లేకుండా పోయింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికను ఉదాహరణగా పేర్కొనొచ్చు. నామినేషన్ ముగింపు ముందు రోజు వైసిపి అభ్యర్థి పి.రామసుబ్బారెడ్డికి పోటీ నామినేషన్ దాఖలైన సంగతి తెలిసిందే. దీన్ని స్క్రూటినీ సమయానికి చెల్లకుండా చేయడంలో కృతకృత్యులు కావడం గమనార్హం. పశ్చిమ రాయలసీమ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం లాంఛనప్రాయంగా మారింది. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్ర ఎన్నికల్లో గెలుపొందడానికి వ్యూహ రచన చేసినట్లు తెలుస్తోంది. 27,716 మంది ఓటర్లను ఆకట్టుకునేందుకు చేసిన వ్యూహరచన ఏమేరకు సఫలమవుతుందో చూడాలి. ఎన్ని పన్నాగాలు పన్నినప్పటికీ అధికార వైసిపికి ఉపాధ్యాయ, పట్టభద్ర ఎన్నికలు పరీక్ష పెట్టనున్నాయి. వైసిపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి దొంగఓట్లను ఎక్కించడం దగ్గర నుంచి ప్రలోభాల వరకు ప్రణాళిక ప్రకారం పావులు కదుపుతుండడం గమనార్హం. ప్రభుత్వ ఉపాధ్యాయుల ఓట్లకు ధీటుగా ప్రయివేటు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల పేర్లను జాబితాలో చేర్పించినట్లు తెలుస్తోంది. వైసిపి అభ్యర్థి ప్రయివేటు ఉపాధ్యాయ సంఘానికి రాష్ట్ర అధ్యక్షునిగా నాయకత్వం వహిస్తుండడంతో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఇతోధికంగా సహకరిస్తుండడంపై ఆశలు పెంచుకున్నట్లు కనిపిస్తోంది. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నిక సవాల్‌గా మారనుంది. గత ఎన్నికల్లో గెలుపు దగ్గరికి చేరుకున్న ఇద్దరు అభ్యర్థులు పోటీ చేస్తుండడం ఆసక్తికరంగా మారింది. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు విజయంపై ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుండడం అధికార పార్టీకి కంటిమీద కునుకు లేకుండా పోతోంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైసిపి తరుపున గెలిచిన ఎమ్మెల్సీ గోపాల్‌రెడ్డికి చెడ్డపేరు రావడంతో ఆయన కుమారుడు రవీంద్రారెడ్డిని నిలబెట్టింది. తండ్రి ప్రభావం కుమారునిపై గణనీయంగా పడే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనా పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు అధికార వైసిపి సెమీ ఫైనల్‌గా భావించినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ జిమ్మిక్కులు పట్టభద్ర, ఉపాధ్యాయ ఎన్నికల్లో ఏమేరకు ఫలితానిస్తాయో వేచిచూడాల్సి ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

తనిఖీలు చేస్తున్న పోలీసులు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రమోహన్ హెచ్చరించారు. స్థానిక యానాది కాలనీలో శనివారం ఆయన సిబ్బందితో కలిసి కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సంర్భంగా ప్రతి ఇంటిని, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ సంఘ విద్రోహ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అక్రమ మద్యం, గంజాయి, నాటుసారా రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు పాల్గొన్నారు.

కుక్కల బెడదను తప్పించాలని వినతి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని సర్వర్‌ఖాన్‌పేట గ్రామంలో కుక్కల బెడదను తప్పించాలని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కడప పార్లమెంటు టిడిపి జాయింట్ సెక్రెటరీ కమలాపురం గౌస్ మొహి ద్దీన్ శనివారం అధి కారులకు వినతిపత్రం అందజేశారు. పుల్లూరు పంచాయతీ సచివాలయ కార్యదర్శి శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. సర్వర్‌ఖాన్‌పేట గ్రామంలో వీధి కుక్కల బెడద చాలా తీవ్రంగా ఉందన్నారు. చిన్నారులను అంగన్వాడీ, పాఠశాలలకు పంపాలన్నా తల్లిదండ్రులు, పెద్దలు భయాందోళన చెందుతున్నారన్నారు. ఇటీవల హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేటలో వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ల బాలుడు చనిపోయిన ఘటనతో తల్లిదండ్రులు హడలిపోతున్నారని వివ రించారు. గతంలో పలుమార్లు ఈ సమస్యను పరిష్కరించాలని కోరినా ఫలితం లేదన్నారు. ఇప్పుడైనా కుక్కల బెడదను తప్పించాలని ఆయన కోరారు. వారం లోపు సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టర్‌ను కలుస్తామని ఆయన తెలిపారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని బాలాజీ హైస్కూల్ ఆవ రణలో ఆదివారం ఉద యం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలకు వరకు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హైకోర్టు లాయర్ బైరెడ్డి లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం ఆయన బాలాజీ హైస్కూల్‌లో విలేకరులతో మాట్లాడుతూ కిమ్స్ హాస్పిటల్ కర్నూల్ వారి సహకారంతో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్నారు. ఇసిజి, 2డి ఎకో, రాండమ్ బ్లడ్, బిపి, క్రియాటిన్ వంటి పరీక్షలు కూడా నిర్వహిస్తామన్నారు. ఈ వైద్య శిబిరంలో అన్ని విభాగాల స్పెషలిస్టులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. తన తల్లిదండ్రులైన స్వర్గీయ బైరెడ్డి నారాయణరెడ్డి, సుశీలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి జ్ఞాపకార్థం ప్రతి ఆరు నెలలకు ఒకసారి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తానని ఆయన చెప్పారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశంతో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. జమ్మలమడుగు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎపిలోనే ధరలు అధికం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

దేశంలోని ఆయా రాష్ట్రాల్లో కంటే ఆంధ్రప్రదేశ్‌లోనే పెట్రోలు ధరలు అధికంగా ఉన్నాయని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గింపు విషయంలో సిఎం జగన్ ద్వంద్వ ప్రమాణాలు పాటించడం దురదృష్టకరమన్నారు. కర్ణాటక, తమిళనాడుతోపాటు పొరుగు రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోలు, డీజిల్ ధరలు లీటరుకు రూ.6, 7 ఎక్కువగా ఉందన్నారు. బాదుడే బాదుడని తమ పార్టీ అధికారంలోకి వస్తే పెట్రోలు ధరలు తగ్గిస్తామని అటు పాదయాత్రలో, ఇటు శాసనసభలో జగన్ అనేక సార్లు చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చాక జగన్ మాట తప్పారని విమర్శించారు.

భాగస్వామ్యంతోనే ఎఫ్‌పిఒలకు ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

భాగస్వామ్యంతోనే ఎఫ్‌పిఒలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నాబార్డ్ డిడిఎం విజయ విహారే అన్నారు. స్థానిక రైడ్స్ శిక్షణ కార్యాలయంలో శనివారం రైతు సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి విజయ విహారితోపాటు హెచ్డిఎఫ్సి, ఏపీజీబీ మేనేజర్లు ముఖ్యఅతిథిలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా విజయ విహారే మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు పొలాల్లో ఒకే పంటను పండించడం, ప్రతిసారి ఆ పంటకు సంబంధిత ఎరువులు వాడడం ద్వారా కొన్నేళ్లకు భూమి గట్టిపడి నిస్సారమవుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పంట మార్పిడి పద్ధతిని పాటించాలని ఆయన సూచించారు. తద్వారా లాభాలు సాధించవచ్చున్నారు. రైడ్స్ డైరెక్టర్ త్యాగరాజు మాట్లాడుతూ ఎఫ్‌ఒల ద్వారా రైతులు ఆర్థికాభివృద్ధి సాధించానేది తమ ముఖ్య ధ్యేయమన్నారు. బ్యాంకు మేనేజర్లు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఎఫ్‌పిఒ సిఇఒ పుష్పరాజ్, జోసెఫ్, రైతులు, రైడ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు చైతన్యవంతులు కావాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు ఆగాలంటే వారు చైతన్యవంతులు కావాలని మేఘనాథరెడ్డి పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రంలో ఐఎఎస్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన శనివారం ప్రొద్దుటూరుకు వచ్చిన సందర్భంగా స్థానిక ప్రముఖ చిత్రకారులు రామాంజనేయరెడ్డి (మహేష్ ఆర్ట్స్, సేవ్‌గర్ల్ చైల్డ్ (ప్రాజెక్ట్ నిర్వాహకుడు) మేఘనాథరెడ్డి స్వీయ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా మేఘనాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళ ఉన్నతంగా చదవాలన్నారు. వృక్ష సంపద లేకుంటే మనిషి మనుగడే ఉండదని తెలిపారు. చిత్రకారిణి, సేవ్‌ట్రీస్ ప్రాజెక్ట్ నిర్వాహకురాలు ప్రసన్న శివుని పెయింటింగ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ వృక్ష సంపద లేకుంటే మనిషి మనుగడే ఉండదన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి - చాపాడు

వేరుశనగ సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే లాభదాయకమని అధికారులు సూచించారు. లు మంచి దిగుబడులు సాధిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. బంకచిన్నయాపల్లి గ్రామంలో రైతులు మల్లేశ్, శ్రీనివాసులరెడ్డి, రామకృష్ణారెడ్డి, రమణమ్మ, నరసింహారెడ్డి, రైతులు కాంపాక్ట్ బ్లాక్‌ను అనుసరించి 15 ఎకరాల్లో పశువుల ఎరువు, ద్రవ డి కంపోజర్, పుల్లటి మజ్జిగ ఉపయోగిస్తున్నారు. పురుగులు, రసం పీల్చు పురుగుల నుండి పంట సస్యరక్షణకు లింగాకర్షణ బుట్టలు, పసుపు, తెలుపు పల్లెం, బార్డర్, క్రాప్ పంటలు సాగు చేస్తున్నారు. ఇలా చేస్తూ ఎకరాకు 40 నుండి 55 బస్తాలు వేరుశనగ కాయలు దిగుబడి సాధిస్తున్నారు. తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పంటల్లో రాజీలేని సూత్రాలు అవలంబించక పురుగు మందులు, రసాయన ఎరువులతో రైతులు అప్పుల్లో పడుతున్నారన్నారు. పలు సమస్యలకు ప్రకృతి వ్యవసాయమే పరిష్కారమన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రధాన పంట

వేరుశనగ పంటలో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేస్తున్న రైతులు

పెట్టే 45 రోజులు ముందస్తుగా 30 రకాల విత్తనాలతో ప్రీ మాన్ డ్రై సోయింగ్ విధానంలో విత్తు కొవాలన్నారు. సేంద్రియ కార్బన్‌ను పెంచుకొని ఘన ద్రవ జీవామృతం ఉపయోగిస్తూ.. పంటల దిగుబడి పెరిగి.. మంచి ఆదాయం రైతులకు వస్తుందని తెలిపారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ వీరారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రాథమిక దశలోనే విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళిక బద్ధంగా విద్యను అభ్యసించాలని ఎంఇఒ వీరారెడ్డి సూచించారు. స్థానిక మహాత్మా జ్యోతిరావ్ పూలే బిసి రెసిడెన్షియల్ (బాలికల) పాఠశాల 4వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో సరస్వతి పూజ చేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం అనేది ఉండాలన్నారు. లక్ష్యం అనేది విద్యార్థులను ఉన్నత శిఖరానికి చేరుస్తుందన్నారు. పబ్లిక్ పరీక్షలు అంటే విద్యార్థుల్లో భయం ఉండకూడదన్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని కోరారు. ప్రభుత్వం గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి, విద్యా బోధన చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రిన్సిపల్ హరిత మాట్లాడుతూ మంచి పౌరులుగా ఎదగాలంటే క్రమ శిక్షణ అవసరమన్నారు. అనంతరం బాలికలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, ఉర్దూ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకురావాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని మైదుకూరు రూరల్ సిఐ నరేంద్రరెడ్డి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడులూ సిసి కెమెరాల ఏర్పాటు వల్ల దొంగతనాలకు అడ్డుకట్ట వేయొచ్చన్నారు. గ్రామాల్లోని వారం దరూ సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో దొంగతనాలు అధికమవుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్ శాఖ తరపున రూ.10,500 సిసి కెమెరాలను అమర్చు తామన్నారు. సిసి కెమెరాలు అధిక

విలేకరులతో మాట్లాడుతున్న సిఐ నరేంద్రారెడ్డి

నాణ్యతతో కూడి ఉన్నాయని, వీటి ఏర్పాటు ద్వారా చోరీ ఘటనలను నివారించవచ్చునని వివరించారు. ప్రజలు కూడా తమ వంతుగా బాధ్యతగా చోరీల పట్ల అప్రమత్తంగా వ్యవ హరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాల్లో ప్రయో గాత్మకంగా కనీసం 15 కుటుం బాలకు సిసి కెమెరాల ఏర్పాటు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని సిఐ తెలిపారు. సిసి కెమె రాల ద్వారా ఒనగూరే ప్రయోజనాలను ప్రజలకు వివరించి, వారు చైతన్యవంతులయ్యేలా గ్రామ సచివాలయ మహిళ సంరక్షణ అధికారి, సిబ్బంది కృషి చేయ నున్నట్లు సిఐ పేర్కొన్నారు. ప్రజా ప్రతి నిధులు, నాయకులు కూడా గ్రామాల్లో వీటి ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ కుళ్లాయప్ప పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు

- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపేల్‌రెడ్డి

ప్రజాశక్తి - దువ్వూరు

బుడ్డ శనగ రైతులు దిగుబడిని అమ్ముకునేందుకు దళారులను ఆశ్రయించొద్దని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపేల్‌రెడ్డి సూచించారు. మండలంలోని పెద్ద జొన్నవరంలోని డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం పరిధిలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ బుడ్డ శనగల కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బుడ్డ శనగ పంట కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడారు. పంట విక్రయించిన తర్వాత రైతులు తెచ్చిన సంచులను వెనక్కి తీసుకెళ్లవచ్చున్నారు. కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న శనగ తుకాలను, అన్ని విషయాలను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిపి జయచంద్రారెడ్డి, పార్టీ మండల నాయకులు వీరారెడ్డి, మండల వ్యవసాయ సలహా చైర్మన్ వీరనారాయణరెడ్డి, ఎఒ అమర్‌నాథ్‌రెడ్డి, విఎఎ సుప్రియ, విఆర్‌ఒ రవి పాల్గొన్నారు.

రేపు శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొండాపురం : నాఫెడ్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి బుడ్డ సెనగలు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తహశీల్దార్ శోభన్‌బాడు, ఎఒ అరుణ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన బుడ్డశనగ కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.5335 ధరతో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సంబంధిత సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో ఇక్రాప్ నమోదు చేయించుకొని ఎఒ శ్రీ వెంకటేశ్వర గోడౌన్ వద్దకు తీసుకరావాలని సూచించారు. ఈ సదవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 94926 24613 నెంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

కొండాపురంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎఒ

పిచ్చిమొక్కలను తొలగించకపోతే నోటీసులు

- మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల- ప్రజాశక్తి టౌన్

స్థానిక 25వ వార్డు చిన్నన్న రాముల్లోని ఖాళీ స్థలంలో నెలకొన్న అపరిశుభ్రత, పిచ్చి మొక్కలను తొలగించకపోతే నోటీసులు జారీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి హెచ్చరించారు. ఈ ప్రాంతంలో అపరిశుభ్రత వల్ల విష పురుగులు, దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందిస్తూ సిబ్బందితో శనివారం ఆ ప్రాంతంలో పర్యటించారు. ఖాళీ స్థల యజమానితో చర్చించి, మూడు రోజుల్లో శుభ్రం చేయించాలన్నారు. అనంతరం జూబ్లీ బస్ స్టాప్ వద్ద ఉన్న మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే శుభ్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది జెసిబి సాయంతో బండరాళ్లను తొలగించారు. వార్డులో సమస్యల పరిష్కారం చేపట్టిన కమిషనర్‌కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, రామకృష్ణారెడ్డి, రాము, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి పథక సంచాలకులు ఆనంద్‌నాయక్ సూచించారు. డిఆర్‌డిఎ కార్యాలయంలో శనివారం కమ్యూనిటీ కో- ఆర్డినేటర్లు, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌నాయక్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు ఏ గ్రేడ్ సాధించాలని బ్యాంకు లింకేజీ రుణాలు, శ్రీనిధి రుణాలు, ఉన్నతి రుణాలు గృహ నిర్మాణం పనులకు, మహిళల జీవనోపాదులకు సద్వినియోగం చేయాలని సూచించారు. పులివెందుల ప్రాంతంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి జీవాలు, ఆవులు గేదలు పెంపకానికి ముందుకు వచ్చిన రైతులకు రుణాలు కల్పించాలని కోరారు. మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయడం ద్వారా మరింత మందికి ఉపాధి కల్పించవచ్చని తెలిపారు. మహిళలకు, యువతకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ జాబ్స్ వేణుమాధవ్, ఎపిఎం గురురాజ్ ఆంజనేయులు, జెఆర్‌పిలు దివాకర్, ఆంజనేయులు, సిసిలు రామచంద్ర, రామాంజనేయులురెడ్డి, మండలం సమాఖ్య అకౌంటెంట్ విజయ్, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి

గడువులోగా పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని పాడా ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. పాడా కార్యాలయంలో శనివారం ఆయన అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ముందుగా పట్టణ పరిధిలో పనులు ఎలా జరుగుతున్నాయని ఎపి జిబిసి అధికారులు, అటవీ శాఖ అధికారులతో చర్చించారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి నియోజకవర్గంలో చేపట్టిన కనెక్టివిటీ రోడ్లు, ఆలయాల పురోగతి పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. వేంపల్లి, తొండూరులో కొత్త తహశీల్దార్ల భవన నిర్మాణ పనులపై సమీక్షించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఇఇ ఓబుల్‌రెడ్డి, డిఇ సుధాకర్‌రెడ్డి, డిఇ రవిచంద్రారెడ్డి. రమేష్‌బాబు, ఎఇలు పాల్గొన్నారు.

పల్లవోలు వాసికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధి లోని పల్లవోలు గ్రామానికి చెందిన మోగిలి రామయ్య ఆర్ఐ పూస క్యాంపస్ ఢిల్లీలో కీటక విభాగంలో పిహెచ్‌డి పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించారు. ఉప రాష్ట్రపతి జగదీప్ దంకర్‌చే పట్టా అందు కున్నారు. ఎఎస్ఆర్‌బి పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, ఐసిఎఆర్ అగ్రికల్చర్ రిసర్చ్ స్టేషన్ కీటక విభాగ శాస్త్రవేత్తగా విధులు నిర్వహించనున్నారు. ప్రస్తుతం కెవికె కళ్యాణదుర్గంలో కీటక శాస్త్రం శాస్త్రవేత్తగా ఉన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ డిప్లమా పూర్తి చేశారు. అలాగే ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయంలో బిఎస్‌సి అగ్రికల్చర్ 2016లో ఉత్తీర్ణత సాధించారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్‌లో కీటక విభాగంలో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రామయ్య గోల్డ్ మెడల్ సాధించడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఉప రాష్ట్రపతిచే డాక్టరేట్ అందుకుంటున్న రామయ్య

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి - లింగాల

మండలంలోని వెలిదండ్ల గ్రామంలో ఎరువుల దుకాణాలను శనివారం రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు డిఇ లోకేశ్వర్‌రెడ్డి ఎఇ బాలగంగాధర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రమేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మణిదీప్ దుకాణంలో తనిఖీ చేయగా ఎరువులు, పురుగుల మందులకు, నిల్వకు సంబంధించి వ్యత్యాసం ఉండడంతో అమ్మకాన్ని నిలుపుదల చేశారు. దుకాణాల యజమానులు సక్రమంగా రికార్డులు నిర్వహించాలని, ఎమ్మార్పీకే రైతులకు అమ్మాలని అధికారులు సూచించారు.

సాధనతో ఏదైనా సాధించగలం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సాధనతో ఏదైనా సాధించగలమని విభిన్న ప్రతిభావంతుడు రాష్ట్రపతి అవార్డు గ్రహీత వెంకట్ తల్లి విశాలాక్షి తెలిపారు. మానసిక వైకల్యంతో జన్మించినప్పటికీ తల్లిదండ్రుల కఠోర శిక్షణతో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ద్వారా అవార్డు పొందిన వెంకట్ గురించి పాఠకులకు తెలిసిందే. వివిధ కళల్లో ప్రావీణ్యం పొందిన వెంకట్ శనివారం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మోటివేషనల్ కార్యక్రమం నిర్వహించారు. గానం, నృత్యం, డైలాగులు, సంగీతం, లిప్ రీడింగ్ కళలను విద్యార్థుల ఎదుట ప్రదర్శించి అలరించారు. ఈ సందర్భంగా విశాలాక్షి మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు. అనుకున్నది సాధించాలంటే ప్రణాళి కాబద్ధమైన ఆచరణతోపాటు ఓర్పు, పట్టుదల ఉండాలన్నారు. ఆత్మ విశ్వాసంతోపాటు సమయం విలువ తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించి మంచి పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం వెంకట్‌ను, విశాలాక్షిని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హిమజాత, చదువుల బాబు, రమాదేవి, ఖాసింసాహెబ్, పద్మావతి, శాంతకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలకు టీకా తప్పనిసరి

- జమ్మలమడుగు ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శాంతికళ

ప్రజాశక్తి - ముద్దనూరు

పిల్లలకు టీకాలు వేయించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని జమ్మలమడుగు ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శాంతికళ పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లి, యామవరం, ముద్దనూరు-2 ఆరోగ్య ఉప కేంద్రాల్లో శనివారం నిర్వహించిన టీకా స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రామ్‌ను పిహెచ్‌సి వైద్యాధికారి కరిష్మాతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతికళ మాట్లాడుతూ తలిదండ్రులు తమ పిల్లలకు తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. టీకా వేయించుకోని పిల్లలను గుర్తించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మహాదేవ యాదవ్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ శోభారాణి, సిహెచ్‌ఒ, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : స్థానిక శాంతినగర్, మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో చిన్నపిల్లలకు సంబంధించి టీకాల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని శనివారం ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి శాంతి కళ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకాలు వేయించుకోని చిన్నపిల్లలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ జ్యోష్న, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సూపర్వైజర్లు ఓబులేసు, లక్ష్మీదేవి, సిహెచ్‌ఒ ప్రశాంత్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీలోని పాములూరు రోడ్డులో ఈనెల 20న విజయ్‌కుమార్‌ను హత్య చేసిన కేసులో కోలా రామాంజనేయులు, కోలా శ్రావణకుమార్, కొనేటి మహేందర్, రౌతు గోవర్ధన్, కొప్పాలి చరణ్‌తేజాను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వేంపల్లెలోని ప్రియా తోటలో నివాసం ఉంటున్న హతుడు విజయ్‌కుమార్‌తోపాటు కోలా రేవంత్‌కుమార్, నక్క రామాంజనేయులు ముగ్గురు స్నేహితులు. 2020లో మండలంలోని నందిపల్లె వద్ద నున్న చెరువు వద్దకు స్విమ్మింగ్ కోసం హతుడు విజయ్‌కుమార్, నక్కా రామాంజనేయులు, కోలా రేవంత్‌కుమార్ వెళ్ళగా ప్రమాదవశాత్తూ అప్పట్లో రేవంత్‌కుమార్ చెరువులో పడి మృతి చెందాడన్నారు. రేవంత్‌కుమార్ మృతికి విజయ్‌కుమార్ కారణమని రేవంత్‌కుమార్ తండ్రి కోలా రామాంజనేయులు కక్ష పెంచుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు. ఈ నేపథ్యంలో కోలా రామాంజనేయులు మరో కుమారుడైన కోలా శ్రావణకుమార్ ఎలాగైన విజయ్‌కుమార్‌ను చంపాలని కొనేటి మహేందర్, రౌతు గోవర్ధన్, కొప్పాలి చరణ్‌తేజాతో మాట్లాడి రూ.4 లక్షలకు సుపారి ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 20న హతుడు విజయ్‌కుమార్‌ను మద్యం సేవించేందుకు వెళదామని చెప్పి కోనేటి మహేందర్, రౌతు గోవర్ధన్, కొప్పాలి చరణ్ తేజా కలిసి పాములూరు రోడ్డులోని నాగలకట్ట వద్ద ముగ్గురాళ్లకు వెళ్లు బండ్ల బాటలోకి తీసుకొని వెళ్లి, మద్యాన్ని విజయ్‌కుమార్ చేత పుల్‌గా తాగించినట్లు చెప్పారు. విజయ్‌కుమార్ మద్యం సేవించిన తర్వాత అక్కడ ఉన్న వారు ఫోన్ ద్వారా కోలా రామాంజనేయులును పిలిచినట్లు తెలిపారు. అనంతరం వారు బండరాయితో, బీరు బాటిల్‌తో తల మీద కొట్టగా విజయ్‌కుమార్ చనిపోగా మోటర్ బైకులో ఉన్న పెట్రోలును తీసి విజయ్‌కుమార్‌పై పోసి నిప్పు పెట్టినట్లు డిఎస్‌పి వివరించారు. కోలా రామాంజనేయులు వద్ద మహేందర్, రౌతు గోవర్ధన్, కొప్పాలి చరణ్ తేజ రూ.50 వేలుతోపాటు రెండు చొక్కాలు తీసుకుని పోతూపోతూ రక్తపు మరకలు ఉన్న చొక్కాను నందిపల్లె వద్ద కాల్చి వేసినట్లు చెప్పారు. హతుడు విజయ్‌కుమార్ తండ్రి రాము ఫిర్యాదు మేరకు సిఐ వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేసినట్లు తెలిపారు. శనివారం రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలోని టీచర్స్ కాలనీ వద్ద ఉన్న నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కేసును చేధించేందుకు ఎస్ఐలు రఘురాం, తిరుపాల్ నాయక్,హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్ వర్మ, కానిస్టేబుళ్ల ఖాదర్‌వలి, శివ చైతన్య, శ్రీనివాసులురెడ్డి, మహేష్‌కు ఎస్‌పి ఆదేశాల మేరకు రివార్డు అందజేసినట్లు డిఎస్‌పి తెలిపారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసులు

రాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో

O.S.No. 744/2022

సయ్యద్ ఖాదర్ వల్లి @ ఖాదర్‌బాషా. ...వాది

Vs

1. వల్లంకొండు వరదరాజు & Another ...ప్రతివాదులు

పై దావాలో వ ప్రతివాదికి పత్రికా ముఖముగా సమను

To,
అల్లం శేషయ్య, S/o పుల్లయ్య, సంఘంపేట, కడప.

అను మీ మీద మరియు వరదరాజగారి మీద వాది దావా దాఖలా ఆస్థిపై స్పెషిఫిక్ ఫర్మార్మెన్స్ ఆఫ్ అగ్రిమెంట్ ఆఫ్ సేల్ & పర్మనెంట్ ఇంజక్షన్ దావాను సలిపియున్నారు. సదరు దావా మీ యొక్క హాజరుకు గాను 14.03.2023వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు 14.03.2023వ తేదీ ఉ॥గం॥10.30 ని॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు/ అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలుపుకోనంతట, పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

సదరు దావాలో పిటిషనర్/ వాది టెంపరరీ ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచూ I.A.No.498/2022 రుగా మీపై & వరదరాజుగారిపై పిటీషన్ సలుపగా, సదరు I.A.లో మీ యొక్క హాజరుకు గాను 14.03.2023వ తేదీకి వాయిదా వున్నది. కావున, సదరు 14.03.2023వ తేదీ ఉ॥గం. 10.30 ని॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు/ అభ్యంతరాలు వున్న యెడల తెలుపుకోనంతట పై I.A.ని మీ పరోక్షముగా తీర్మాణించెదరు.

ది: 25/2/2023

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

ఎమ్.సుధాకర్ బాబ్జీ
వకీలు, కడప.

వ్యవసాయ మార్కెట్ కమిటి, కార్యాలయము, కడప.

ఆర్.ఓ.సి.నెం.04/2023 తేది:25.02.2023

క్యాంటిన్ టెండరు నోటీసు

ఇందుమూలముగా అనుభవం గల క్యాంటిన్ నిర్వాహకులకు తెలియజేయడమేమనగా వ్యవసాయ మార్కెట్ కమిటి, కడప మార్కెట్ యార్డు నందు గల క్యాంటిన్ అగ్రిమెంటు పొందిన తేది నుండి ఒక సంవత్సరము కాలము పాటు నిర్వహించుటకు నెలసరి బాడుగ పై ఒక సంవత్సరము కాలము పాటు నిర్వహించుటకు ఆసక్తి గల వారు రూ.1,00,000/- (అక్షరాల ఒక లక్ష రూపాయలు మాత్రము) ధరావత్తు సొమ్మును " కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటి, కడప" వారి పేరిట డిమాండు డ్రాఫ్టు ద్వారా మాత్రమే) ఈ కార్యాలయము నందు చెల్లించి వేలమునందు పాల్గొనవచ్చును.

ఇందుకు సంబంధించిన టెండరు షెడ్యూలు తేది: 27.02.2023 ఉదయం 10-00 గం॥ నుండి 02.03.2023 ఉదయం 11-00 గం॥ల వరకు ఈ కార్యాలయము పనిదినములలో రూ.500-00 (రూపాయలు ఐదు వందల రూపాయలు మాత్రమే) నగదుగా చెల్లించి దరఖాస్తు ఫారంను పొందవచ్చును. ఆసక్తి గల వారి నుండి సీల్డు టెండర్లు తేది: 02.03.2023 సాయంత్రము 5-00 గం॥ వరకు ఈ కార్యాలయము నందు స్వీకరించబడి, తేది: 03.03.2023 సాయంత్రం 5-00 గం॥లకు హాజరైన టెండరుదార్ల సమక్షములో తెరువబడును. ఇతర వివరములు తెలుసుకొనగలవారు కార్యాలయములో పనిచేయు వేళలో నేరుగా సంప్రదించి తెలుసుకొనవచ్చును.

ఇట్లు
సం/- పి.బాలవెంకటరెడ్డి,
ఎంపిక శ్రేణి కార్యదర్శి,
వ్యవసాయ మార్కెట్ కమిటి, కడప.

ఇట్లు
సం/- శ్రీమతి బంగారు గంగాదేవి,
అధ్యక్షురాలు
వ్యవసాయ మార్కెట్ కమిటి, కడప.